ఇత్తెహాదుల్ ముస్లిమీన్

హైదరాబాద్ సంస్థానాన్ని రద్దు చేసి, అందులోని వివిధ భాషా ప్రాంతాలను పొరుగునే ఉన్న ఆయా భాషా రాష్ట్రాల్లో విలీనం చేయాలని, ప్రజారాజ్యంలో సమైక్య భాషా రాష్ట్రాల నిర్మాణం చేయాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ప్రజలు ఏర్పాటు చేసిన గూటపాల సంఘాలకు (లాఠీ సంఘాలు) చెందిన దళాలన్నీ నైజాం నవాబుకు వ్యతిరేకంగా మారణాయుధాలను సమకూర్చుకున్నాయి. ఈ పరిస్థితుల్లో నిజాం పెద్ద ఎత్తున భీభత్స కాండకు పూనుకున్నాడు.

'మజ్లిస్-ఇత్తెహాద్-ఉల్-ముస్లమీన్' అనే సంస్థను 1927లోనే నిజాం ప్రోత్సహించాడు. రాజరికం దైవదత్తమనే సిద్ధాంతాన్ని వారు ప్రచారం చేశారు. దానికి కాశిం రజ్వీ నాయకుడు. కాశిం రజ్వీ రజాకార్లు (పారా మిలటరీ) హిందువులపై సాగించే అత్యాచారాలు, అకృత్యాలకు అడ్డులేకుండా పోయింది. ప్రభుత్వాన్ని రజాకార్లే నడుపుతున్నారని ప్రజలు భావించారు. ఈ పరిస్థితిలో రజాకార్ల దురాగతాలను అధిగమించడానికి కమ్యూనిస్టులు త్రిముఖ వ్యూహం రూపొందించారు. గ్రామదళాలు, నిర్మూలన దళాలు, గెరిల్లా దళాలు ఏర్పాటు చేశారు. గ్రామ రక్షక దళాలు రజాకార్లకు వ్యతిరేకంగా, గెరిల్లా దళాలు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడే విధంగా కమ్యూనిస్టులు ప్రజల్ని జాగృతపరిచారు.

ప్రజల నుంచి విరాళాలు సేకరించడానికి ప్రజా నాట్యమండలి నడుం బిగించింది. ఇందులో భాగంగా రూపొందిందే 'మాభూమి' నాటకం. మద్రాసు ప్రెసిడెన్సీ ప్రభుత్వం 'మా భూమి', కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించింది. కమ్యూనిస్టుల సాయుధ పోరాటంతో తెలంగాణ గ్రామాల్లో ఉన్న వడ్డీ వ్యాపారులు, భూస్వాములు ప్రభుత్వోద్యోగులు వరంగల్, హైదరాబాద్ నగరాలకు పారిపోయారు. కమ్యూనిస్టులు అనేక గ్రామాలను విముక్తి చేశారు. నిజాం ప్రభుత్వం, రజాకార్ల దురాగతాలు గ్రామాల్లో సమసిపోయాయి. జాగీదార్ల భూములను కమ్యూనిస్టులు స్వాధీనం చేసుకొని పేదలకు పంచి పెట్టారు.

1948, సెప్టెంబర్ 13న భారత సైన్యం నిజాం నవాబుపై పోలీసు చర్య చేపట్టింది. సెప్టెంబర్ 17న భారత సైన్యానికి నిజాం లొంగిపోయాడు. ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనమైంది. భారత సైన్యాన్ని విముక్తి సైన్యంగా, నిజాం రజాకార్లను అంతమొందించిన సైన్యంగా ప్రజలు స్వాగతించారు. అయితే, ఇండియన్ యూనియన్‌తో పోరాటం కొనసాగించాలని కమ్యూనిస్టులు తీసుకున్న నిర్ణయం ప్రజల ఆనంద ఉత్సవాలను కొంతవరకు హరించిందని చెప్పవచ్చు.

ప్రాక్టీస్ బిట్స్

1. హైదరాబాద్ నగరంలో కామ్రేడ్స్ అసోసియేషన్ ఏ సంవత్సరంలో ఏర్పడింది?

ఎ) 1940 బి) 1939 సి) 1934 డి) 1942

సమాధానం: ఎ

2. హైదరాబాద్ రాష్ట్రంలో 'కమ్యూనిస్టు పార్టీ'ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?

ఎ) 1930 బి) 1934 సి) 1939 డి) 1940

సమాధానం: సి

3. తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీని హైదరాబాద్ నవాబు ఏ సంవత్సరంలో నిషేధించాడు?

ఎ) 1940 బి) 1942 సి) 1939 డి) 1946

సమాధానం: డి

4. జాయిన్ ఇండియా మూవ్‌మెంట్ (Join India Movement) 1947 లో కింది వారిలో ఎవరు ప్రారంభించారు?

ఎ) పుచ్చలపల్లి సుందరయ్య బి) బూర్గుల రామకృష్ణారావు
సి) స్వామీ రామానంద తీర్థ
డి) దేవులపల్లి వెంకటేశ్వరరావు

సమాధానం: సి

5. 'మజ్లిస్-ఇత్తె-హాదుల్-ఉల్ ముస్లమీన్' అనే పారా మిలటరీ వ్యవస్థను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?

ఎ) 1920 బి) 1922 సి) 1927 డి) 1930

సమాధానం: సి

6. 1944లో భువనగిరిలో జరిగిన 'ఆంధ్ర మహాసభ'కు అధ్యక్షత వహించినదెవరు?

ఎ) వి. ఆళ్వారు స్వామి బి) బద్దం ఎల్లారెడ్డి
సి) చండ్ర రాజేశ్వరరావు డి) రావి నారాయణరెడ్డి

సమాధానం: డి